సాక్షి శ్రీకాకుళం

సోమవారం। 4। డిసెంబర్। 2023



మళ్లీ పుట్టినింటికి..

తేలుకుంచి నిశ్శబ్దమైపోతోంది. సైబీరియా పక్షులు తిరిగి వెళ్లిపోతున్నాయి.

-10లో



40 తులాల బంగారం చోరీ

నరసన్నపేటలోని ఓ డెంటిస్ట్ ఇంటిలో చోరీ జరిగింది. బంగారం, డబ్బు దొంగిలించారు.

-10లో

రాగి విత్తనాల పంపిణీ

కొత్తూరు: చిరుధాన్యాల సాగుతో రైతులకు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కాకరగూడతో పాటు పలు గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం రాగి విత్తనాలను పంపిణీ చేశారు. వీటినిపై రాయితీపై అందిస్తున్నారని, వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

నేటి స్పందన కార్యక్రమం రద్దు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మిచాంగ్ తుఫాను కారణంగా స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న స్పందన ఈ రోజు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. భారీ వానలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో స్పందన రద్దు చేశామన్నారు.

పోలీస్ స్పందన రద్దు

శ్రీకాకుళం క్రైమ్: తుఫాను దృష్ట్యా సోమవారం జరగాల్సిన పోలీసు స్పందన రద్దు చేస్తున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని వ్యయ ప్రయాసలకు ఓర్చి రావద్దని విజ్ఞప్తి చేశారు.

ఆసక్తికరంగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో ఎత్తుకు పైఎత్తులేస్తున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా చెస్ అసోసియేషన్ శిక్షణ కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. ఐదు రౌండ్ల పాటు సాగిన ఓపెన్ విభాగంలో శ్రీకాకుళం నగరానికి చెందిన చంద్రమౌళి ప్రథమ స్థానంలో నిలిచి విజేతగా నిలవగా, శ్రీకాకుళానికే చెందిన కుప్పిలిసాయి వెంకట్ ద్వితీయ స్థానం, పలాసకు చెందిన కల్పక్, చలపతిరావు మూడు నాలుగు స్థానాల్లో నిలవగా, టెక్కలికి చెందిన బగాడ చలపతి ఐదో స్థానంలో, ఆమదాలవలసకు చెందిన రామవృడు ఆరో స్థానంలో నిలిచారు. పోటీలను ఏపీ రాష్ట్ర చెస్ సంఘ కార్యదర్శి సనపల భీమారావు మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు.

ఓటరు జాబితాలో సవరణకు అవకాశం

కాశీబుగ్గ: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల సవరణల కోసం డిసెంబరు 9 వరకు అవకాశం ఉందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. పలాస మండలానికి సంబంధించిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు పలాస, కాశీబుగ్గ హైస్కూళ్లలో ఆదివారం నిర్వహించారు. కలెక్టర్ ఆదివారం ఇక్కడ ఆకస్మిక పరిశీలన నిర్వహించారు. 2, 3 తేదీల్లో జిల్లాలో 2357 బూత్ స్థాయి శిబిరాలు ఏర్పాటు చేశారని తెలిపారు. డిసెంబరు 26వ తేదీ లోపల మాత్రమే ఓటు నమోదుకు అవకాశం ఉందని తెలిపారు. 18 ఏళ్లు నిండినవారు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, కొత్త ఓటరు జాబితా వచ్చే నెల 5వ తేదీన ప్రదర్శిస్తామని అన్నారు. జిల్లాలో ఒకే డోర్ నంబర్‌లో 800 ఓట్లు ఉన్నాయని గుర్తించామని వాటిని అధికారులు పరిశీలించి 222 వరకు తగ్గించగలిగామని అన్నారు. ఎక్కడైనా ఇలాంటి సమస్యలు ఉంటే ఫారం 8ను సమర్పిస్తే తప్పనిసరిగా వాటిపై చర్యలు చేపడతామని అన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా శాఖ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న అప్పయ్య, అచ్చెన్నాయుడు, ప్రభాకరరావు, కృష్ణమూర్తి తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ నూతన భవన శంకుస్థాపన ఆదివారం ఘనంగా జరిగింది. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు బొడ్డేపల్లి అప్పయ్య, సువ్వారి అచ్చెన్నాయుడు, సీహెచ్ ప్రభాకరరావు, హనుమంతు కృష్ణమూర్తి తదితరుల చేతులమీదుగా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన సమావేశానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు, ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, విజయనగరం పార్వతీపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుఖారి బాబు, నల్ల బాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్‌బాబు తదితరులు హాజరై ప్రసంగించారు. సీనియర్ నాయకులను సత్కరించారు.



సంతబొమ్మాళి మండలం మూలపేటలో శరవేగంగా నిర్మాణం జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ పోర్టు

ఫుల్ సపోర్టు

- మూలపేట పోర్టు, అప్రోచ్ రోడ్డు ఇతర అభివృద్ధి పనులకు రూ.209.05 కోట్లు విడుదల
- భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, అప్రోచ్ రోడ్డు తదితర వాటి కోసం రూ.196.41 కోట్ల చెల్లింపులు
- పోర్టు నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



టెక్కలి:

మూలపేట పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం ఫుల్ సపోర్టు అందిస్తోంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ పోర్టు కోసం ప్రభుత్వం ఎక్కడా నిధుల విషయంలో జాప్యం చేయడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయడం మొదలుకుని పనులు జోరుగా జరుగుతున్నాయి. మరో వైపు పోర్టు నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల నిధులను దశల వారీగా ప్రభుత్వం అందజేస్తుండడంతో జిల్లా యంత్రాంగం పనులు ముమ్మరం చేస్తోంది. మూలపేట పోర్టు భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, అప్రోచ్ రోడ్డు ఇతరత్రా కార్యక్రమాల కోసం ఇప్పటి వరకు సుమారు రూ.209.05 కోట్లు విడుదల చేయగా రూ.196.41 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన రూ.12.64 కోట్లు బ్యాలెన్స్ నిధులు ఉన్నాయి.

- టెక్కలిలో 36.10 ఎకరాలకు సంబంధించి ఇప్పటికే 106 మందికి రూ.17.68 కోట్లు చెల్లించారు. మిగలిన 9 మందికి చెల్లించాల్సి ఉంది.
- బన్నువాడలో 54 మందికి సంబంధించి ఇప్పటికే 52 మందికి రూ.6.16 కోట్లు చెల్లించారు. మరో ఇద్దరు స్థానికంగా లేకపోవడంతో పెండింగ్‌లో ఉంచారు.
- మోదుగువలసలో 87 మందికి సంబంధించి ఇప్పటికే 46 మందికి రూ.4.79 కోట్లు చెల్లించారు. మరో 41 మందికి రూ.4.10 కోట్లు చెల్లించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.
- వేములవాడలో 71 మందికి సంబంధించి ఇప్పటికే 65 మందికి రూ.7.10 కోట్లు చెల్లించారు. మిగిలిన ఆరుగురికి త్వరలోనే చెల్లించనున్నారు.
- వీటితో పాటు మరో రూ.11 కోట్లు ల్యాండ్ అథారిటీకి జమ చేశారు.

పరిహారం చెల్లించారు



మూలపేట పోర్టుకు సంబంధించి అప్రోచ్ రోడ్డుకు భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లింపులు జరిగాయి. ఈ విషయంలో ఎక్కడా జాప్యం లేదు. అభివృద్ధి కోసం అంతా సహకరిస్తున్నాం. పోర్టు నిర్మాణం జరిగితే మా ప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని గట్టిగా నమ్ముతున్నాం. అందుకే భూములను త్యాగం చేశాం.
– పోలాకి మోహన్‌రావు, సర్పంచ్, బన్నువాడ

నిధులకు ఎక్కడా జాప్యం లేదు



ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం జరుగుతున్న మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి అవసరమైన నిధుల విషయంలో ప్రభుత్వం నుంచి ఎక్కడా జాప్యం లేదు. జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన నిధులను పోర్టుకు అవసరమైన వాటి కోసం తక్షణమే చెల్లింపులు చేస్తున్నాం.
– నూరుల్ కమార్, సబ్ కలెక్టర్, టెక్కలి

నిధుల వివరాలు

పోర్టు ఏరియా భూసేకరణ కోసం	రూ.67.68 కోట్లు
ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం	రూ.13.81 కోట్లు
540 మంది పీడీఎఫ్‌ల చెల్లింపుల కోసం	రూ.52.80 కోట్లు
అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో ఉన్న 168 మందికి చెల్లించినది	రూ. 1.10 కోట్లు




పోర్టు అప్రోచ్ రోడ్డు కోసం..

కస్పా నౌపడ లో 30.175 ఎకరాలకు చెల్లించినది	రూ. 7.59 కోట్లు
రాజపురం లో 13.75 ఎకరాలకు	రూ.3.44 కోట్లు
ఇజ్జువరం లో 12.48 ఎకరాలకు	రూ.3.21 కోట్లు
పాతనౌపడ లో 17.35 ఎకరాలకు	రూ.4.33 కోట్లు
తలగాం లో 38.31 ఎకరాలకు	రూ.12.06 కోట్లు

వరి కోతలు వద్దు

- తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో మిచాంగ్ తుఫాన్‌గా బలపడనుందని, జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దాదాపు 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారని పేర్కొన్నారు. రైతులు వరి కోతలు చేయవద్దని, కోతలు కోసిన వారు పనలు పెట్టుకుని పరదాలు కప్పుకోవాలని సూచించారు. నూర్పులు చేసిన వారు ఆర్‌బీకేలను సంప్రదించి మిల్లులకు సురక్షితంగా ధాన్యం తరలించాలని తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేశామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామన్నారు. ఈ విషయాలన్నింటిని ప్రతి గ్రామంలో ఆయా మండల తహసీల్దార్లు దండోరా వేయాలన్నారు. తుపాన్‌పై ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకునేవారు అందుబాటులో ఉన్న రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. జిల్లా కేంద్రంలో తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అత్యవసర సమయంలో 08942-240557కు ఫోన్ చేయాలని తెలిపారు.

రైతులు అప్రమత్తత



ఎచ్చెర్లలో యంత్రాలతో వరి నూర్పు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తమవుతున్నారు. ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగట్లపాలేం గ్రామాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. ఒడ్డుపై బోట్లు భద్ర పర్చారు. ఫరీదుపేట, ఇబ్రహింబాద్, తమ్మినాయుడుపేట, పూడివలస, తోటపాలేం, పొన్నాడ, ఎచ్చెర్ల ప్రాంతాల్లో నూర్పులు చేశారు.

కడలిలో కల్లోలం



మంచినీళ్లపేట తీరంలో కల్లోలంగా ఉన్న సముద్ర తీరం

వజ్రపుకొత్తూరు: మిచాంగ్ ప్రభావంతో కడలి కల్లోలంగా మారింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా తమ బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండలంలోని దేవునల్తాడ, కంబాలరాయుడుపేట, నువ్వలరేవు, డోకులపాడు, అక్కుపల్లి, గుణుపల్లి చేపల వేట తీరాల్లో అలలు దాదాపు 50 మీటర్లు ముందుకు రావడంతో అధికారులు నిత్యం ఆ ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు. తీర ప్రాంతంలోని 11 పంచాయతీల్లో మత్స్యకారులను చేపల వేటకు వెళ్లరాదని, సురక్షిత ప్రాంతంలో తలదాచుకోవాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి దండోరా వేయించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 9550669551 నంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 14 మంది వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను కంట్రోల్ రూంలో అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.



తీరంలో ఉంచిన చేపల వేట బోట్లు

కన్నుల పండువగా కార్తీక దీపోత్సవం



వెంకటేశ్వరాలయంలో చేపట్టిన కార్తీక దీపోత్సవంలో శివకేశవుల ముగ్గు చుట్టూ దీపాలకంరణ

స్థానిక వెంకటేశ్వరాలయంలో కార్తీక బహుళ షష్టి సందర్భంగా నిర్వహించిన కార్తీక దీపోత్సవం ఆకట్టుకుంది. దీపోత్సవంలో లక్ష్మీ నరసింహ కోలాటం భజన బృందం ప్రదర్శన అలరించింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
– నరసన్నపేట

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



ఇంద్రపుష్కరిణి వద్ద దీపాలను వదులుతున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక ఆదివారం కావడంతో ఉదయానికే మహిళలు ఇంద్రపుష్కరిణిలో కార్తీక దీపాలను వెలిగించారు. సూర్యోదయ సమయానికి పూజలు పూర్తి చేసుకుని స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక, విశిష్ట దర్శనాల మార్గాల్లో ప్రత్యక్ష దైవాన్ని దర్శించుకున్నారు. అలాగే ఆరోగ్యం కోసం సూర్య నమస్కార పూజలు చేయించుకున్నారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రతి భక్తునికి స్వామి దర్శనమయ్యేలా చర్యలు చేపట్టారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ. 5,06,200, పూజలు, విరాళాల ద్వారా రూ. 64,545, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,25 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తెలియజేశారు.

‘సంకల్పమే వారి ఆయుధం’

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమాజంలో సాధారణ పౌరుల కంటే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, సంకల్పాన్ని వైకల్యం అడ్డుకోలేదని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బెహరా మనో వికాస కేంద్రం నిర్వాహకులు శ్యామల ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన సృష్టికర్త ఒక బ్రహ్మ లఘు నాటికను ఆద్యంతం తిలకించి, విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు అంటే దివ్యమైన శక్తి వారిలో ఉందని అర్థం చేసుకోవచ్చన్నారు. వీరిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందని చెప్పారు. సదరం ధ్రువీకరణ పత్రాలు తక్షణమే మంజూరయ్యేలా చూస్తున్నామని, సచివాలయ స్థాయిలో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వ నియామకాల్లో 4శాతం రిజర్వేషన్ అమలవుతోందని, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో చర్యలు తీసుకున్నట్లు వివరించారు. స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ క్రింద బ్యాక్ లాగ్ పోస్టుల్లో 239 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలు కల్పించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు కమ్యూనిటీ హాల్ కావాలని కోరగా.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో రూ.1,75,750 విలువ చేసే ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్లు, వినికిడి యంత్రాలు అందజేశారు. 52 దివ్యాంగుల స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.72 లక్షల బ్యాంకు లింకేజి చెక్కును అందజేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, యూత్ కో ఆర్డినేటర్ ఉజ్వల్, సెట్ శ్రీ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.వి.ప్రసాదరావు, మెప్మా పీడీ కిరణ్, జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాలమాన్‌సింగ్, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణరావు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ల్యాప్‌టాప్, ఫోన్లు అందిస్తున్న జేసీ నవీన్

సంక్షేమ పథం



ఐదుసార్లు వాహనమిత్ర అందుకున్నాను



నేను రాగోలు కాలనీలో జగనన్న ఇంటిలోనే నివసిస్తున్నాను. ఆటో నడుపుకుంటూ బతుకుతున్నాను. వాహన మిత్ర పథకం ద్వారా ఏటా నేను ఇన్సూరెన్స్, టాక్సులు కట్టుకున్నాను. ఇప్పటివరకూ నాకు ఐదు సార్లు ఈ పథకం అందింది. ఈ పథకం నాలాంటి పేదవారికి ఎంతో ఊతం ఇచ్చింది. ఈ పథకం లేకపోతే రోజువారీ చేసిన డబ్బులు ఇన్సూరెన్స్‌లకు, ట్యాక్సులకు మాత్రమే సరిపోయేది. ఒకప్పుడు భయపడేవాడిని కానీ ఇప్పుడు జగనన్న ఏటా ఆగస్టులో నాకు వాహనమిత్ర ద్వారా డబ్బులు వేస్తున్నారు. నాకు ఏ బెంగా లేదు. భవిష్యత్ తరాలు బాగుండాలన్నా, మళ్లీ నవరత్నాలు కావాలన్నా మా జగనన్ననే మేం గెలుపించుకుంటాం.
– జి.జయరాం, జగనన్న కాలనీ, రాగోలు

జన్మలో ఇల్లు రాదనుకున్నాం...

నేను కోటబొమ్మాళి జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నాను. నా భర్త నారాయణరావు హోటల్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారు. నాకు ముగ్గురు ఆడపిల్లలు. గత ముప్పై ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే కాలం గడిపాం. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నోసార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసినా స్థలం ఇవ్వలేదు. ఈ జన్మలో మాకు ఇల్లు రాదని అనుకున్నాం. కానీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇల్లు మంజూరు చేశారు. అక్కడే ఇల్లు కట్టుకున్నాం. ముఖ్యమంత్రి జగన్ బాబుకు ధన్యవాదాలు.
– సకలాభక్తుల ప్రభావతి, జగనన్నకాలనీ, కోటబొమ్మాళి



హెలీప్యాడ్ కోసం స్థలం పరిశీలన



హెలీప్యాడ్ కోసం స్థలం పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: అంపురం జాతీయ రహదారి పక్కన ఖాళీ స్థలంలో హెలీప్యాడ్ ఏర్పాటు కోసం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదివారం స్థల పరిశీలన చేశారు. మకరాంపురం గ్రామంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా నూతనంగా నిర్మించిన 2 లక్షల లీటర్ల ట్యాంకు ప్రారంభోత్సవానికి ఈనెల 12వ తేదీన సీఎం రానుండడంతో ముందస్తు ఏర్పాట్ల కోసం స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్ హైమావతి, ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం ప్రాజెక్టు పంపింగ్ కేంద్రం పరిశీలన

మండలంలోని మకరాంపురం వద్ద నిర్మించిన మండలస్థాయి ఉద్దానం ప్రాజెక్టు పంపింగ్ కేంద్రాన్ని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదివారం పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్ ఈ నెల 12న ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడ పనుల్ని పరిశీలించారు.

బూత్ లెవల్ అధికారిపై కలెక్టర్ ఆగ్రహం

విధుల్లో నిర్లక్ష్యం చూపించిన బూత్ లెవెల్ అధికారిపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని మకరాంపురం పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఇక్కడ చేపడుతున్న ప్రక్రియ లోపభూయిష్టంగా ఉండడాన్ని కలెక్టర్ గమనించారు. ఇక నుంచి సరిచేసుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ భరత్‌నాయక్‌ను ఆదేశించారు. బీఎల్‌ఓలు ఓటర్ల ప్రక్రియ డిసెంబర్ 7 లోగా పూర్తి చేయాలన్నారు.

క్లుప్తంగా

ప్రపంచ తెలుగు ఉత్సవాలకు 'కుత్తుం'

పలాస: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 16, 17వ తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహిత్య –కళా ఉత్సవాల్లో పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన వాగ్గేయకారుడు కుత్తుం వినోద్ పాల్గొననున్నారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రోగ్రాం కన్వీనరు కొల్లి రమావతి నుంచి ఆహ్వానం అందినట్టు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో తనను భాగస్వామిని చేసినందుకు వినోద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



బహుమతులు పొందిన ప్రయాణికులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం 1, 2వ డిపోల నుంచి వివిధ మార్గాల్లో ప్రయాణించిన వ్యక్తులకు గిఫ్ట్ స్కీమ్ కింద ఆదివారం బహుమతులు అందజేశారు. నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు రెండు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఆమదాలవలస, చీపురుపల్లి, బందరువానిపేట, సాలూరు, విజయనగరం, జీకే వలస, యరగాం, శ్రీముఖలింగం రూట్లలో ప్రయాణం చేసిన వారికి డ్రా తీశారు. వీరిలో శ్రీనివాసరావు, రామకృష్ణ, తరంగిణి, సుష్మిత, చందు, చిన్నా, సాయికిరణ్, హృదయ నందన్ తేజేశ్వరి, హర్ష, సూర్యకుమారి, జగదీష్, అప్పలరాజు, శకంరరావు, హేమలతలు గెలవగా వారికి బహుమతులు అందజేశారు.

కుప్పిలికి జాతీయ స్థాయి పురస్కారం



వెంకట రాజారావు

ఆమదాలవలస: విజయనగరం గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి సందర్భంగా జాతీయ స్థాయిలో కవితల పోటీ ఇటీవల నిర్వహించారు. 95 కవితలు పోటీకి రాగా, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్ న్యాయనిర్ణేతగా ఎంపిక చేసిన 10 మంది విజేతల్లో ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకటరాజారావు కూడా ఉన్నారు. ఆయన కవిత ఉత్తమ పురస్కారానికి ఎంపికైందని ఆ సంస్థ కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం విజయనగరంలో ప్రముఖ సినీ గీత రచయిత చంద్రబోస్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు రాజారావు తెలియజేశారు.

దాతలు స్పందిస్తే జగన్నాథుని గుడి నిర్మాణం



కవిటిలో జగన్నాథ స్వామి ఆలయం

కవిటి: కవిటిలో 160 ఏళ్ల చరిత్ర కలిగిన జగన్నాథ స్వామి ఆలయ నిర్మాణానికి స్థానికులు పూనుకున్నారు. అయితే దాతలు సహకరిస్తే జీర్ణోద్ధరణ పనులు వేగంగా జరుగుతాయని వారు విన్నవిస్తున్నారు. ఈ ఆలయం ఇటీవల జీర్ణావస్థకు చేరింది. దీంతో స్థానిక జగన్నాథ ఆలయ కమిటీ జీర్ణోద్ధరణ బాధ్యతలను తీసుకుంది. ఇందుకోసం పూరీ పట్టణానికి చెందిన శిల్పులను కూడా సంప్రదించారు. దాదాపు రూ.35 లక్షల వరకు ఖర్చవుతుందని లెక్క కట్టారు. స్థానికులు కొందరు విరాళాలు సేకరించగా.. మరికొంత అప్పు చేశారు. నిధులన్నీ అయిపోవడంతో దాతల సాయం కోరుతున్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని అనుకునేవారు 9177363867ను సంప్రదించాలని కోరుతున్నారు.



పక్షి పిల్లలతో వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్న పక్షులు





స్వదేశానికి పయనమైన సైబీరియన్ పక్షులు

మళ్లీ పుట్టినింటికి

- స్వదేశానికి పయనమవుతున్న విదేశీ పక్షులు
- నిశ్శబ్దమైపోతున్న తేలుకుంచి

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో నిన్నమొన్నటి వరకు సందడి చేసిన సైబీరియా పక్షులు సంక్రాంతి రాకుండా స్వదేశానికి పయనమైపోతున్నాయి. జిల్లాలో తేలినీలాపురం తరువాత సైబీరియన్ పక్షులు విడిది చేసేది ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామంలోనే. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తొలకరి జల్లులు కురిసే సమయానికి ఇక్కడకు వచ్చిన విదేశీ విహంగాలకు ఈ ఏడాది ప్రకృతి అనుకూలించకపోడంతో వెళ్లిపోతున్నాయి. జూన్‌లో ఇక్కడకు వచ్చే పక్షులు ఈ గ్రామంలోనే ఊర చెరువు, గ్రామ దేవత ఆలయం వద్ద నున్న చెట్లపై గూళ్లు ఏర్పాటు చేసుకుని గుడ్లు పొదుగుతాయి. పగలంతా తంపర భూముల్లో, వరి చేలల్లో తిరుగుతూ చేపలు, నత్తలు, కప్పలు, పురుగులు, ఆల్చిప్పలను ఆహారంగా తీసుకుని ఆరు నెలలు పాటు తమ పిల్లలతో గడుపుతాయి. జనవరి నెల సంక్రాంతి తరువాత తమ ప్రాంతాలకు పయనమవుతుంటాయి. అయితే ఈ ఏడాది వర్షాలు లేకపోవడం పక్షులకు ఆహార కేంద్రాలైన పంట పొలాలు, చెరువుల్లో నీరు లేకపోవడంతో ముందుగానే వెళ్లిపోతున్నాయి.

ముమ్మరంగా కార్డన్ సెర్చ్‌లు



శ్రీకాకుళంలో మహిళ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఐ లక్ష్మణరావు



పాతపట్నం: చిన్నమల్లిపురంలో ఇంటి వివరాలు అడుగుతున్న ఎస్‌ఐ రాజేష్



టెక్కలిలో కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి స్థానిక ఆదిఆంధ్ర వీధిలో ఆదివారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం పరిధిలోని ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలతో పాటు మిగిలిన సుమారు 40మంది పోలీసులు ఈ సెర్చ్‌లో పాల్గొన్నారు. దీనిలో నాటుసారా, గంజాయి వంటి నిషేధిత పదార్థాల గురించి ఆరా తీశారు. అనంతరం వీధిలోని ప్రతి ఇంటిని గాలించి రికార్డులు లేని 6 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం వీధి వాసులతో మాట్లాడుతూ వీధిలో ఎవరైనా గుర్తు తెలియని, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో..

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని చౌదరి సత్యనారాయణ కాలనీలో ఉదయం నుంచి రెండో పట్టణ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు సీఐ పప్పల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు నాగిరెడ్డి లక్ష్మణరావు, కె.లక్ష్మి, మరో 28 మంది వరకు స్టేషన్ సిబ్బంది 186 ఇళ్లను సెర్చ్‌లో భాగంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఆధార్ కార్డులను పరిశీలించి విచారించడమే కాక అనుమానాస్పదంగా ఉన్న 106 ద్విచక్ర వాహనాలను, ఎనిమిది ఆటోలను, ఒక కారును పరిశీలించి పత్రాలు లేని రెండు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నివాస గృహాలవారితో సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు కనబడినా.. రాత్రి వేళల్లో గంజాయి, మద్యం తాగి ఎవరైనా అసౌకర్యం కలిగించినా.. గంజాయి అమ్ముతున్నట్లు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచిత వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇవ్వరాదని మైనరు అమ్మాయిలతో వస్తే పోలీసులకు చెప్పాలన్నారు. ద్విచక్ర వాహనాలు కొనేటప్పుడు సంబంధిత పత్రాలు లేకుండా కొనకూడదని, కొన్నా వారి నుంచి సంబంధిత పత్రాలను ట్రాన్స్‌ఫర్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

సరిహద్దులో

పాతపట్నం: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం మండలంలోని పెద్దమల్లిపురం, చిన్నమల్లిపురం గ్రామాల్లో ఆదివారం తెల్లవారు జామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రెండు గ్రామాల్లో ఉన్న ఇళ్లలో సోదాలు, వాహనాల తనీఖీలు నిర్వహించారు. పాతపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీఐ ఎం.వినోద్ బాబు ఆధ్వర్యంలో మెళియాపుట్టి ఎస్‌ఐ టి.రాజేష్, కొత్తూరు ఏఎస్‌ఐ శివాజీ రెడ్డితో పాటు 20 మంది పోలీసులు సెర్చ్‌లో పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ ఎంపికలు



హ్యాండ్‌బాల్ క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సబ్–జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఆదివారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా జరిగాయి. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని కృష్ణకుమార్, చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు గుంటూరు జిల్లా తెనాలి వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలకు పంపిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రవిశేఖర్, డి.ఈశ్వరరావు, గురుగుబెల్లి రాజశేఖర్, హరీష్‌రాయుడు, కె.లక్ష్మణరావు, ఎల్.ఢిల్లేశ్వరరావు, కోచ్ అనీల్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం వద్ద సంబరాలు



సంబరాలు నిర్వహించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (ఇందిరా విజ్ఞాన భవన్) వద్ద ఆ పార్టీ నాయకులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. తెలంగాణలో పార్టీ అధికారం సాధించడంతో డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి పెట్టారు. పార్టీ కోసం, ప్రజల కోసం మనమంతా కలసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి.గోవింద మల్లిబాబు, జిల్లా యువజన అధ్యక్షుడు రెల్ల సురేష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కేవీఎల్ఎస్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా అండర్-14,17 ఫెన్సింగ్ ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులతో ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ:

క్రీడాకారులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఎల్లప్పుడూ లభిస్తాయని శ్రీకాకుళం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళంలోని టౌన్‌హాల్ వేదికగా నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–14, అండర్–17 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగాయి. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. అంతకుముందు ఈ ఫెన్సింగ్ ఎంపిక పోటీలను అసోసియేషన్ ముఖ్య ప్రతినిధులు తైక్వాండో శ్రీను, ఎం.సుధీర్ వర్మ, సంపతిరావు గోవిందరాజులునాయుడు, గురుగుబెల్లి ప్రసాద్‌లతో కలిసి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ ఎంపికలు ఎన్ఐఎస్ శిక్షకులు జోగిపాటి వంశీ పర్యవేక్షణలో జరుగగా రాష్ట్ర పరిశీలకుడిగా విజయనగరం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డీవీ చారి,తైక్వాండో కోచ్ గౌతమ్, పీడీ డి.భవానీ, కోచ్‌లు అనిత, రాహుల్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి రాష్ట్రపోటీలు..

ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను విజయనగరం వేదికగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఏపీ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలకు పంపిస్తామని ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలభద్రుని సురేష్‌కుమార్(రాజా) తెలిపారు. రాష్ట్రపోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

మరికొన్ని రైళ్లు రద్దు

భువనేశ్వర్: మిచాంగ్ తుఫాను నేపథ్యంలో విపత్తు ప్రభావాల నిర్వహణకు ఈస్ట్ కోస్ట్ రైల్వే (ఈకోర్) జోన్ పరిధిలో అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. రవాణా, రైల్వే పట్టాల సత్వర పునరుద్ధరణకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విశాఖ, ఖుర్దారోడ్డు, సంబల్‌పూర్ ప్రధాన కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ ప్రారంభించారు. భువనేశ్వర్‌లో హెల్ప్‌లైన్ నంబర్లు 0674 – 2301525, 2301626, 2303060 అందుబాటులోకి తీసుకొచ్చారు. కాగా, తుఫాన్ నేపథ్యంలో శనివారం ప్రకటించిన రైళ్లతో పాటు మరికొన్ని రైలు సేవలు రద్దు చేసినట్లు ఆదివారం ప్రకటించారు. తిరుపతి – బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్(3వ తేదీ), బిలాస్‌పూర్ – తిరుపతి(5వ తేదీ), తిరుపతి– పూరీ ఎక్స్‌ప్రెస్(4వ తేదీ), పూరీ– తిరుపతి(6వ తేదీ), బెంగళూరు–గౌహతి(6, 7వ తేదీలు), ఎర్నాకులం – టాటా ఎక్స్‌ప్రెస్(6వ తేదీ)లు రద్దు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం రూరల్: సింగుపురం పరిసర ప్రాంతంలో ప్రశాంత్ నగర్ కాలనీ ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు రూరల్ ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. ఇతను ఈ ప్రాంతంలోనే భిక్షాటన చేస్తుంటాడని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని బంధువులు ఎవరైనా ఉంటే రూరల్ పోలీసులు సంప్రదించాలని కోరారు.

శ్రీరామ ప్రతిష్ట అక్షింతల ఊరేగింపు



కవిటిలో అయోధ్య రాముని దివ్య అక్షింతల్ని ఊరేగిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

కోటబొమ్మాళి, కాశీబుగ్గ,కవిటి: అయోధ్య రామాలయం నుంచి తీసుకువచ్చిన అక్షింతల కలశాలను విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆదివారం కోటబొమ్మాళిలో ఊరేగించారు. జనవరి 1 నుంచి 15 వరకూ ప్రతి గృహానికి అందజేస్తామన్నారు. అలాగే భజరంగదళ్ పలాస అధ్యక్షులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలాసలోనూ అక్షింతలను ఊరేగించారు. కవిటిలోనూ వీటికి ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

40 తులాల బంగారం చోరీ

- నరసన్నపేటలో డెంటిస్ట్ ఇంట దొంగతనం
- బంగారంతో పాటు రూ.3 లక్షల నగదు దోపిడీ



సీసీ పుటేజీలో కనిపించిన వ్యక్తి



మంచంపై చిందర వందరగా ఉన్న వస్త్రాలు

నరసన్నపేట: స్థానిక ఇందిరా నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న దంత వైద్యుడు గురుదేవ్ ఇంటిలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. 40 తులాల బంగారు ఆభరణాలు, మూడు లక్షల నగదు దొంగిలించారు. ఈ మేరకు గురుదేవ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐ వై.సింహాచలం ఇంటిని పరిశీలించారు.

శనివారం రాత్రి చోరీ..

గురుదేవ్ కుటుంబ సభ్యులు శనివారం అరకు వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చారు. తలుపులు తెరిచే సరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువా తెరిచి ఉంది. బెడ్ రూం అంతా చిందర వందరగా ఉంది. బీరువాను పరిశీలించిన గురుదేవ్ ఆభరణాలు, డబ్బు కనిపించకపోయే సరికి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ పుటేజీలు పరిశీలించిన పోలీసులు, గురుదేవ్ కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఒంటి గంట తరువాత చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ దొంగతనం పాత నేరస్తుల పనే అని పోలీసులు భావిస్తున్నారు. ఈ మధ్య కాలంలో విశాఖ, విజయనగరంలో కూడా ఈ ముఠా చోరీలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

రెండు రోజుల కిందట మారుతీ నగర్‌లోని విశ్రాంత బ్యాంకు మేనేజరు సుధాకర్ ఇంటిలోనూ చోరీ జరిగింది. అయితే విలువైన వస్తువులేమీ లేకపోవడంతో సుధాకర్ ఊపిరి పీల్చుకున్నారు. నరసన్నపేట సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ చోరీపై సమాచారం వచ్చిందని ఇంటిని పరిశీలించామని తెలిపారు.

రెండు కార్లు ఢీ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మందస: మండలంలోని భిన్నళమదనాపురం సమీపంలో గల జాతీయ రహదారిపై ఆదివారం ఆగి ఉన్న కారును వెనుక వైపు నుంచి వచ్చిన మరో కారు బలంగా ఢీకొంది. ఆగి ఉన్న కారు నుజ్జునుజ్జయ్యింది. పలాస నుంచి సోంపేట వైపు వెళ్తున్న మరో కారు బలంగా వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఆగి ఉన్న కారు నుజ్జునుజ్జయ్యింది. ఢీకొన్న వేగానికి రెండు కార్లూ కొంతదూరంలో ఉన్న సర్వీసు రోడ్డు వరకు వెళ్లిపోయాయి. వెనుక నుంచి వచ్చిన కారులో ఉన్న ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందజేసి, హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.

నేడు కుంబిడి జాతర



భక్తుల కోసం ఏర్పాటు చేసిన దైవదర్శన మార్గం

వీరఘట్టం: మండలంలోని కుంబిడి–ఇచ్ఛాపురం గిరిజన గ్రామంలో సోమవారం జాతర జరగనుంది. ఏటా కార్తీకమాసంలో వచ్చే మూడో సోమవారం నాడు ఈ జాతర నిర్వహిస్తుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో జాతరకు సంబంధించి, ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులు ఇక్కడి కుంభేశ్వరుని(ఉమామహేశ్వరుడు) దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేస్తారు.

ఒడిశాలో పులి కలకలం

- భయంతో చెట్టెక్కిన మహిళ
- రెండు గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపిన వైనం
- పరిశీలించిన అటవీ అధికారులు



పులి సంచరిస్తున్న దృశ్యం

రాయగడ: గజపతి, రాయగడ, కంధమాల్ జిల్లాల్లో కొద్దిరోజులుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పెద్దపులి తాజాగా కంధమల్ సరిహద్దులోని గొటొనా గ్రామంలో హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన జయంతి జగరంగ అనే మహిళ శనివారం పొలంలో పనులు చేసుకుంటుండగా పులి అరుపు వినపడటంతో చెట్టెక్కింది. కొద్దిసేపటికే ఆ దిశగా పులి వెళ్లడం చూసి తన వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో వీడియో తీసింది. సుమారు అరగంట పాటు చెట్టుపైనే ఉండి ప్రాణాలను కాపాడుకుంది. అనంతరం గ్రామానికి చేరుకుని విషయాన్ని గ్రామస్తులకు చెప్పింది. సమాచారం తెలుసుకున్న మునిగుడ అటవీ శాఖ అధికారులు రెండు బృందాలుగా వీడి వివరాలను సేకరించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ బయటకురావద్దని సూచించారు. మునిగుడ సమితి బంధుగుడ అడవుల్లో రెండు రోజుల క్రితం పెద్దపులి బర్రెపిల్లను చంపినట్లు అక్కడి వారు చెబుతున్నారు. పులి వీడియో వైరల్ కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మహిళా సాధికారతపై..



ఒడిశా రాష్ట్రం పూరీలో జరుగుతున్న అంతర్జాతీయ సైకతశిల్ప కళా ఉత్సవాల్లో ఆమదాలవలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. మూడో రోజు ఉత్సవాల్లో హరికృష్ణ మహిళా సాధికారతపై సైకత శిల్పాన్ని అందంగా తీర్చిదిద్దారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని సూచించేలా శిల్పాన్ని రూపొందించారు.
– ఆమదాలవలస రూరల్